విశాలాంధ్ర విజయనగరం

పేజి నెం. 8

మంగళవారం, 18, నవంబర్ 2025

వివాదస్పదంగా మారిన

కుమరాం హైస్కూల్ ప్రహరీ నిర్మాణం

- నిర్మాణాన్ని అడ్డుకుంటున్న ఆక్రమణదారుడు
- ఆక్రమణ దారునికి అండగా అధికార పార్టీ నేతలు

విశాలాంధ్ర-జామి: మండలంలోని కుమరాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ప్రహరీ నిర్మాణం వివాదస్పదంగా మారింది. ఇటీవల పాఠశాల ప్రహరీ నిమిత్తం ప్రభుత్వం రూ.36లక్షలను మంజూరు చేసింది. గతంలో ప్రహరీ శిథిలమవ్వడంతోపాటు కొన్ని వైపు గోడ లేకపోవడంతో అనేక దొంగతనాలు జరిగాయి. ఎట్టకేలకు ప్రహరీ మంజూరు కావడంతో ఊపిరిపీల్చుకున్న ఉపాధ్యాయులకు ప్రహరీ స్థలాన్ని ఆక్రమించిన ఓఆక్రమణదారుడు చుక్కలు చూపిస్తున్నాడు. సర్వే నెం.84/1లో పాఠశాలకు అనుకుని ప్రభుత్వ స్థలం ఉంది. ప్రస్తుతం ఈస్థలం ఓవ్యక్తి ఆక్రమణలో ఉంది. సదరు స్థలంలో ప్రహరీ గోడ నిర్మాణానికి ఆక్రమణ దారుడు అంగీకరించడంలేదు. పైగా ఆక్రమణదారునికి అధికారపార్టీకి చెందిన ఓ నేత అండదండలు ఉండడంతో మరింతగా రెచ్చిపోతున్నాడు. ప్రహరీకి స్థలం ఇచ్చేది లేదని ఖరాఖండీగా చెబుతున్నాడు. దీనిపై ఉపాధ్యాయులు రెవెన్యూకు మొరపెట్టుకోగా సర్వే సిబ్బంది వచ్చి సర్వే చేసి స్థలాన్ని అప్పగించారు. కానీ నిర్మాణానికి మాత్రం ఆక్రమణదారుడు ససేమిరా అనడంతో ఉపాధ్యాయులు తెల్లమొహం వేయాల్సి వస్తోంది.

చోధ్యం చూస్తున్న అధికారులు..

పాఠశాల ప్రహరీ నిర్మాణం ఆగిపోయిన విషయం తెలిసినా అధికారులు కనీసం స్పందించడం లేదని తెలుస్తోంది. సదరు ఆక్రమణదారునితో రాయభేరాలు చేస్తున్నారని భోగట్టా. ధర్జాగా స్వాధీనం చేసుకోవాల్సిన పరిస్థితిలో ఎందుకిలా నాన్చుడి వైఖరి అవలంబిస్తున్నారోనని స్థానికులు అయోమయంలో ఉన్నారు. మరోవైపు సదరు అధికార పార్టీ నేత ఉపాధ్యాయులను పలు విదాలుగా భయాందోళనకు గురిచేస్తున్నారని సమాచారం. ప్రహరీ నిర్మాణంవివాద స్పదం కావడంతో ఉపాధ్యాయులు ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అధికారులు ఈవిషయంలో ఏనిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే..

పీజీఆర్ఎస్ వినతులను త్వరితగతిన పరిష్కరించాలి

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పిజిఆర్ఎస్)కు విశేష స్పందన
- కలెక్టర్ ఎస్ రాంసుందర్ రెడ్డి

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు వచ్చిన వినతులను త్వరితగతి నపరిష్కారించాలని సంబంధిత అధికారులకు జిల్లా కలక్టరు ఎం .రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలక్టరు ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కు విశేష స్పందన లభించింది. జిల్లా కలక్టరు, జిల్లా రెవెన్యు అధికారి, స్పెషల్ డిప్యూటి కలక్టర్లు ప్రజల నుండి ధరఖాస్తులు స్వీకరించి వారి సమస్యలను సావధానంగా విన్నారు. ఫిర్యాదుల నుండి 230 వినతులు స్వీకరించి, వినతులపై తగు పరిష్కారం, చర్యలు చేపట్టుటకు సంబంధింత అధికారులను కలక్టరు ఆదేశాలు జారీచేసారు. రెవెన్యు శాఖకు సంబంధించి 92 వినతులు, డిఆర్డిఎ సంబంధించి 27 వినతులు, గ్రామ సచివాలయం శాఖకు సంబందించి 28 వినతులు, మున్సిపల్ శాఖ-15, విద్యా శాఖ-12, పంచాయితీశాఖ-10, విద్యుత్ శాఖ-5, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ-3, హౌసింగు-2, ఇతర శాఖ నుండి 36 వినతులు స్వీకరించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడు తూ అధికారులు అర్జీదారును కలిసి, మాట్లాడిన తర్వాతనే ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. అర్జీదారునితో మాట్లాడిన తేదీ, సమయం కూడా వారి రిపోర్ట్ లో నమోదు చేయాలన్నారు. పిజిఆర్ఎస్ టోల్ ఫ్రీ నెంబర్ 1100 పై ప్రజలకు అవగాహన కలిగించాలని తెలిపారు. ఈ నెంబర్ కు అందిన కాల్స్ కు కూడా సంబంధిత అధికారి సమాధానం సరైన రీతిలో అందజేయవలసి ఉంటుందన్నారు. అర్జిదారుల సమస్యల పరిష్కారంపై సంబంధింత అధికారులను తగు చర్యలు, సత్వర పరిష్కారానిని చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీచేసారు. నవంబర్ 30 లోపల గృహాల సర్వే: గృహాల కోసం దరఖాస్తులు చేసుకున్న వారి వివరాలను సర్వే చేసి అర్హత ఉన్న వారి వివరాలను యాప్ లో ఎం.పి.డి.ఓ నమోదు చేయాలని సంబంధిత అధికారులను కలక్టరు ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు డి.వెంకటేశ్వర రావు, మురళి, రాజేశ్వరి, ప్రమీల గాంధీ, బి. శాంతి, కళావతి , సర్వే శాఖ ఎ.డి. ఆర్.విజయకుమార్, కలక్టరేటు పరిపాలనాధికారి దేవి ప్రసాద్, సి.పి.ఒ. బాలజి, జిల్లా విద్యాశాఖాధికారి మణిక్యంయుడు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఏపీ పెట్టుబడుల దిశ ను మార్చే చారిత్రాత్మక వేదికగా విశాఖ..

ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-లక్కవరపుకోట: ఆంధ్రప్రదేశ్ ను పెట్టుబడుల హబ్ గా మార్చేందుకు సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ ఎంతో వ్యూహాత్మకంగా శ్రమిస్తున్నా నిరూపణగా సిఐఐ భాగస్వామి సదస్సు నిలిచిందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలుగుదేశం పార్టీ క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాయల సీమ, కోస్తా ఆంధ్ర, ఉత్తరాంధ్ర మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేష్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారని అన్నారు. ఏపీ సి ఆర్డిఏ, ఎనర్జీ, ఫుడ్ ప్రాసెసింగ్, పరిశ్రమలు, వాణిజ్యం, ఐటి, ఎలక్ట్రానిక్స్, టూరిజం , మునిసిపల్ వంటి కీలక శాఖలో ఒప్పందాలు కుదరడం పెట్టుబడులను సమగ్రంగా ఆకర్షిస్తున్న ప్రభుత్వ నైపుణ్యాన్ని చూపింది అని అన్నారు. అంచనాలకు మించి పరిశ్రమలు ఏపీ వైపు పరిగెత్తి రావడం చంద్రబాబు, లోకేష్ నాయకత్వంలో అభివృద్ధి మళ్ళీ ట్రాక్ పైకి వచ్చిందని నిరూపించింది అన్నారు. పెట్టుబడులు ఒక ప్రాంతానికి మాత్రమే కాకుండా మూడు ప్రాంతాలకు సమానంగా వెళ్లడం ఇది ప్రభుత్వ వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనమని అన్నారు. నాడు జీ నోము వ్యాలీ, మైక్రోసాఫ్ట్ వంటి టెక్క దిగ్గజాలను హైదరాబాదుకు తీసుకువచ్చి అభివృద్ధిలో రాష్ట్రాన్ని ముందుంచిన వ్యక్తి చంద్రబాబు అని అన్నారు. సదస్సులో విశాఖలోనే జరిగి ఉండవచ్చు కానీ పెట్టుబడులు మాత్రం యావత్తు రాష్ట్రానికి విస్తరించేలా సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ కృషి చేశానన్నారు. ఇది ఒక్కటే కాదు ప్రతి నియోజకవర్గానికి ఒక ఎస్ఎంఎస్ ఇ పార్కు ఏర్పాటు చేసి ఇంటికో పారిశ్రామికవేత్తను తయారు చేసే విధంగా స్పష్టమైన ప్రణాళికతో ప్రభుత్వ అడుగులు వేస్తుంది అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి రాయవరపు చంద్ర శేఖర్, కే రమణమూర్తి, పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్లు. జగనన్న ఇల్లుకై డబ్బులు కట్టిన వారికి న్యాయం చేయండి

సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పన్న డిమాండ్

విశాలాంధ్ర-బొబ్బిలి: పట్టణం పరిధిలో ఉన్న రామందొర వలస గ్రామ సమీపన పెండింగ్లోఉన్నటువంటి టిడ్కో ఇల్లు. మరియు వైయస్సార్ ప్రభుత్వం అధికారంలో ఉండేటప్పుడు జగనన్న కాలనీ ఇల్లు తక్షణమే మౌలిక సదుపాయాలు కల్పించి లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం అందజేయాలని కోరుతూ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ ఎం శ్రీను కు వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కోట అప్పన్న. సిపిఐ మండల కార్యదర్శి తాడంగి ఎండుదొర మాట్లాడుతూ 2014-19 మధ్యలో టీడీపీ అధికారంలో ఉన్నపుడు ప్రవేశపెట్టిన టిడ్కో ఇళ్ళ పథకం కోసం.ఎందరో పేద,మధ్య తరగతి ప్రజలకు ప్లాట్లు కేటాయింపులకు 5వేల రూపాయల నుండి 25వేల రూపాయల వరకు డిపాజిట్ గా కట్టియున్నారు. దాదాపు 70-80 శాతం నిర్మాణం కూడా టీడీపీ ప్రభుత్వం పూర్తి చేయగా 2019 లో వైసీపీ అధికారంలోకి వచ్చాక, టిడ్కో ఇళ్లను పక్కన పెట్టి కొత్తగా జగనన్న కాలనీలు ఇచ్చారు.. టిడ్కో ఇళ్ళ కోసం కట్టిన డబ్బులు కూడా వెనక్కి ఇవ్వలేదు... అటు ఇల్లూ లేదు, డబ్బులు లేవు అంటూ పేద, మధ్య తరగతి వారు లబోదిబోమన్నా పట్టించుకునే నాథుడే లేదు. ఇప్పటికైనాప్రస్తుత కూటమి ప్రభుత్వం టిడ్కో ఇల్లును. వైసిపి ప్రభుత్వం కట్టించిన ఇల్లును పూర్తి చేసి మౌలిక సదుపాయాలైన మంచినీరు, రోడ్లు, కరెంటు ఏర్పాటుచేసి పేదలకు పంపిణీ చేయాలని, డబ్బులు కట్టిన పేదలందరికీ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మండల నాయకులు ఆర్ నాగమ్మ. పాలక పద్మ పాల్గొన్నారు.

వీలుపర్తిలో భద్రతకి బలమైన గోడ

సొంత ఖర్చుతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసిన సర్పంచ్ లీలా అప్పారావు

విశాలాంధ్ర-వేపాడ: వీలుపర్తి గ్రామ భద్రతను దృష్టిలో పెట్టుకుని గ్రామ సర్పంచ్ శానాపతి లీల అప్పారావు ఆదర్శంగా నిలిచారు.రూ.48 వేల సొంత నిధులతో గ్రామంలోని కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి గ్రామంలో భద్రతా వలయాన్ని మరింత బలపరిచారు.వేపాడ నుండి వీలుపర్తి %-% వావిలపాడు మార్గాలపై నిత్యం భారీ వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటంతో ఎప్పుడెప్పుడు ఏ ప్రమాదాలు జరుగుతాయోననే భయంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తుండటంతో, ఆ సమస్యను పరిష్కరించే దిశగా సర్పంచ్ ముందడుగు వేశారు. గ్రామ కేంద్రంలోని యేసుక్రీస్తు శిలా విగ్రహం, ఆంజనేయస్వామి గుడి సమీపం, అలాగే ఊరు బయట వావిలపాడు-పెద్దదుంగాడ రహదారి మూడు రోడ్ల కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. దీంతో ఏ ప్రమాదం జరిగినా వెంటనే గుర్తించే అవకాశం కలుగుతుందని గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.సీసీ కెమెరాల ఏర్పాటు కార్యక్రమంలో టిడిపి నాయకులు గోకాద నాగభూషణం, కొప్పల అప్పారావు, బెహరా నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ గోకాద అచ్చం నాయుడు, పచ్చికూర సత్తిబాబు, గ్రామస్తులు తొండవరపు వెంకటరమణ, గుమ్మాల రమణ, గండి పడాల జోజి బాబు తదితరులు పాల్గొని పర్యవేక్షించారు. గ్రామ భద్రత కోసం సొంత నిధులతో ముందుకు వచ్చిన సర్పంచ్ శానాపతి లీల అప్పారావుకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలుపుతూ అభినందనలు తెలియజేశారు.

పంచాయతీ కార్మికులు సమ్మె విరమణ

విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం, పురిటి పెంట గ్రామ పంచాయతీ కార్మికులు రెండు నెలల జీతాలు చెల్లించాలని, చెత్త బళ్ళు రిపేర్లు చేయించాలని గత నాలుగు రోజులుగా చేస్తున్న సమ్మెను సోమవారం విరమించారు. ఈవో జి. జనార్ధన రావు వారితో చర్చలు జరిపిఒక నెల జీతం ఇవ్వడమయింది అని మరో నెల జీతం గురువారం లోపు ఇస్తామని హామీ ఇచ్చారని , మిగిలిన సమస్యలను పరిష్కరిస్తామని చెప్పడంతో విరమించామని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి లక్ష్మి తెలిపారు. అలాగే సమ్మెకు సహకరించిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

ప్రైవేటీకరణ విరమించకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు

విశాలాంధ్ర-చీపరుపల్లి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ విరమించుకోక పోతే ప్రజలే బుద్ధి చెపుతారు అని, జిల్లా పబ్లిసిటీ వింగ్ అధ్యక్షులు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, యూత్ అధ్యక్షులు బెల్లాన వంశీ అన్నారు. సోమవారం చీపురుపల్లి పట్టణం పిల్లపేట వీధిలో మెడికల్ కాలేజీల ప్రైవేటీ కరణకు వ్యతిరేకంగా కోటిసంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కోటి సంతకాల సేకరణ అనంతరం గవర్నర్ కి నివేదించి ప్రైవేటీకరణను నిలుపుదల చేయాలని కోరుతామన్నారు, ప్రజలకు ఉచితంగా అందజేస్తున్న విధ్య, వైద్యం రెండింటిని ప్రైవేటుపరం చేసి కాసులు గుంజుకోవాలన్న దుర్మార్గపు ఆలోచన మానుకోవాలంటూ కూటమి ప్రభుత్వాన్ని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ప్రతినిధి ముల్లుపైడిరాజు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహంతి ఉమా,గవిడి సురేష్, కంచుపల్లి అశోక్, సతివాడ అప్పారావు,సతివాడ అధిక్రిష్ణ, గంట్యాడ బుజ్జి, ఇజ్జురోతు రమణ, కొణితల గొల్ల ,మహిళలు, పెద్దలు, యువత పాల్గొన్నారు.

భోజన పథకాన్ని పరిశీలించిన డిప్యూటీ డిఇఓ రమణ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలంలోని మెరకముడి దాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం చీపురుపల్లి డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి కె.వి రమణ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథక అమలు తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం ఎండిఎం అమలు పరచాలని, రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని విద్యార్థులకు అందించాలని ఆదేశించారు. సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి వందరోజుల 10వ తరగతి యాక్షన్ ప్లాన్ అమలు గూర్చి చర్చించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి ఎం చంద్రశేఖర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎస్. తిరుపతిరావు,ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువల్లో పేరుకుపోయిన పూడిక తొలగింపు

విశాలాంధ్ర -విజయనగరం: చాలా కాలంగా కాలువల్లో పేరుకు పోయిన పూడికను విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశాలతో ప్రజా రోగ్య సిబ్బంది తొలగించి వేశారు. పలు ప్రాంతాల్లో కాలువల్లో పూడిక చేరి నిరుపయోగంగా పడి ఉండడానికి గుర్తించిన ఆయన తక్షణమే కాలువల పరిశుభ్రతకు ఆదేశించారు. అలాగే నిరుపయోగంగా ఉన్న కాలువలను వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. దీంతో ఆయా సర్కిళ్ల వారీగా పారిశుధ్య పర్యవేక్షకులు ప్రత్యేక సిబ్బందితో కాలువల ప్రక్షాళనకు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రజావసరాల కోసం కాలువలు ఎంతో ముఖ్యమైనవని అన్నారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలతో పూడిక చేరి నిరుపయోగంగా ఉండడం క్షమించరాని విషయమని అన్నారు.

గడ్డి మందు కొట్టి పంటను నష్ట పరిచిన బంధువు!

వరిపంట నాశనమవడంతో లబోదిమంటున్న అన్నదమ్ములు

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఆస్తి గోడవలతో కష్టపడి తమ పశువులకు ఆహారంగా పెంచుకున్న సుమారు ఎకరా పొలం లో గడ్డి కి కక్షతో గడ్డి మందు కొట్టి పంటను నష్ట పరిచాడు తన దగ్గర బంధువు, వివరాల్లోకి వెళితే, పట్టణంలోని స్థానిక కోట వీధికి చెందిన చదరం శ్రీనివాసరావు, చదరం అప్పారావు అనే అన్నదమ్ములు తమకున్న విశాఖ-అరుకు రోడ్డు పక్కనున్న ఎకరం పొలంలో గడ్డిని, పశువులను పెంచుతూ పాల వ్యాపారం చేసుకుంటూ తమ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు, అయితే ఇటీవల నలభైఏళ్ల క్రితమే వారి వాటా పొలాన్ని అమ్ముకుని వెళ్లి పోయిన తమ చిన్నాన్న కొడుకు వచ్చి తిరిగి నా పొలాన్ని ఇవ్వమని తగువు పెట్టాడు. అతనికి ఎటువంటి ఆధారాలు లేకపోవటం తో చేసేది లేక అక్కసుతో గడ్డి మందును కొని తీసుకొని వచ్చి ఎవరు లేని సమయం చూసుకుని పొలంలో గడ్డి మందుని చల్లి పరారీ అవటంతో తెల్లవారి రైతులు వచ్చి చూసుకు నేసరికి పంట అంతా నాశనం అయ్యి ఉండే సరికి లబోదిబోమంటూ పోలీసులకు పిర్యాదు చేసారు. ఈ ఘటన పై పోలీస్ లు దర్యాప్తు చేస్తున్నారు, దీనితో తమ పశువులకు ఆహారమైన గడ్డి లేక ఆకలి తో అలమటిస్తున్నాయి అని కన్నీరు మున్నీరు అవుతున్నారు.

ఉద్యోగాల పేరిట యువతను మోసం చేసిన జిందాల్ కంపెనీ ,జిల్లా రెవెన్యూ సిబ్బంది

విచారణకు పంపితే ఆధారాలతో బట్టబయలు చేయడానికి సిద్ధం

జిందాల్ నిర్వాసితులు

విశాలాంధ్ర-శృంగవరపుకోట రూరల్: మండలంలోని బొడ్డవరలో జిందాల్ నిర్వాసితుల పోరాటం 158వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ ు జిందాల్ లో జరుగుతున్న అవకతవకలు అసలు ఊహకు అందనివని, దీని వెనుక జిందాల్ యంత్రాంగం, జిల్లా రెవెన్యూ సిబ్బంది కలిసి పన్నిన దుష్టపన్నాగం ఉందని తీవ్ర ఆరోపణలు చేశారు. భూములు కూడా లేని వ్యక్తులకు జె ఎస్ డబ్ల్యూ, ఖాతా నుండి కనీస వేతనాలు జమ కావడం, బినామీల పేర్లతో చెల్లింపులు జరపడం, అమాయక యువత నుంచే ఉద్యోగాల పేరుతో డబ్బులు వసూలు చేయడం ఇవన్నీ ఒక్కరోజు పనులు కాదని, ఎవరూ పట్టించుకోరని ఇష్టారాజ్యంగా జిందాల్ యాజమాన్యం, జిల్లా రెవెన్యూ యంత్రాంగం కలసి చేసిందని బాధితులు ఆరోపించారు.ఇతర ప్రాంతాలకు చెందిన, ఈ గ్రామాలకి ఏమాత్రం సంబంధం లేని వ్యక్తుల పేర్లను భూమి రికార్డుల్లోకి ఎక్కించి, వారికి నకిలీగా పేమెంట్లు చేసిన అంశం బయటపడిందని ఆరోపించారు. ఇంకా, రికార్డుల్లో లేని సర్వే నంబర్లకు కూడా చెల్లింపులు చూపించడం, ఒకే వ్యక్తికి 9 ఎకరాలు 40 సెంట్ల అసైన్డ్ భూమి ఉన్నట్టు, ఒక్క సర్వే నంబర్పై రెండు సార్లు పేమెంట్లు నమోదు చేయడం వంటి సంఘటనలు బయటపడుతున్నాసర్కారు వ్యవస్థ మాత్రం మూగబోయిందని అన్నారు. భూమి తీసుకున్న దానికి రిజిస్ట్రేషన్కు అయిన దానికి, పేమెంట్ లు ఇచ్చిన దానికి ఏ మాత్రం పొంతన లేదు అన్నారు. ఎటువంటు ఆధారాలు లేకుండా కూడా పేమెంట్లు ఎలా జరిగాయి? అసలు ఆ డబ్బులు ఎవరికి చేరాయి?" అని జిందాల్ నిర్వాసితులు నేరుగా ప్రశ్నించారు."ఈ అవకతవకల మొత్తం జాడలను, ఆధారాలను మేము సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాం. వెంటనే విచారణ ప్రారంభించండి. వాస్తవాలు ఒక్కొక్కటిగా బయటపడతాయి. ఈ దందా ఎంత పెద్దదో అప్పుడు మీకే తెలుస్తుంది" అని కలెక్టర్ను డిమాండ్ చేశారు. జిందాల్ యంత్రాంగం మరియు రెవెన్యూ సిబ్బందిపై ఉన్న ఈ తీవ్ర ఆరోపణలను పత్రికా ప్రకటన రూపంలో గ్రీవెన్స్గా సమర్పించి, తక్షణమే నిష్పక్షపాత విచారణ చేయాలని డిమాండ్ చేసారు.

తల్లిదండ్రుల సంరక్షణ పిల్లల ప్రధమ కర్తవ్యం

జూనియర్ సివిల్ జడ్జి కనకలక్ష్మి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: తల్లిదండ్రుల సంరక్షణ, వయో వృద్ధుల చట్టం 2007 అనే అంశంపై శృంగవరపుకోట జూనియర్ సివిల్ జడ్జి కుమారి బి కనకలక్ష్మి అధ్యక్షతన స్థానిక పంచాయతీ కార్యాలయ సమావేశ మందిరంలో న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. సదస్సును ఉద్దేశించి న్యాయమూర్తి మాట్లాడుతూ తల్లిదండ్రుల సంరక్షణ వారి యొక్క పిల్లల ప్రథమ కర్తవ్యం అన్నారు. ఒకవేళ ఏమైనా వారిని నిర్లక్ష్యం చేసిన యెడల పిల్లలపై కఠిన చర్యలు తీసుకొనుటకు చట్టాలు ఉన్నాయన్నారు. అలాగే ప్రభుత్వం తరపున కూడా వయోవృద్ధులకు వివిధ సంక్షేమ పథకాలు ఉన్నాయని ఆ సంక్షేమ పథకాల అమలు గాని యెడల లేదా పిల్లలు తల్లిదండ్రులను నిర్లక్ష్యము చేసినా, పెన్షన్ అందే విధానములో ఎటువంటి లోపాలు ఉన్నా స్థానిక మండల న్యాయ సేవా కమిటీని సంప్రదించడం ద్వారా తగు సూచనలను ఉచిత న్యాయ సహాయము ద్వారా అందించబడుతుందన్నారు. ఒకవేళ కేసును నడిపించాల్సి వస్తే ఉచితంగా ప్రభుత్వం తరపున న్యాయవాదులను నియమించి వయోవృద్ధులకు న్యాయ సహాయము చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు అల్లు సత్యాజీ, జి.ప్రకాశరావు, బి.సత్యనారాయణ, యమ్.అనురాధ, బొబ్బిలి రామకృష్ణ, పి.సంతోష్ అవగాహన కల్పించారు. న్యాయవాదుల సంఘం కోశాధికారి, న్యాయవాదులు, బి.త్రిమూర్తులు, జి చిట్టిబాబు, ఆర్.సత్యనారాయణ, సి.హెచ్.ఆర్.ఏ. నాయుడు, శివ, కోర్టు సిబ్బంది కె. శ్రీనివాసరావు, పింఛనుదార్ల సంఘం అధ్యక్షుడు బొడ్డేటి. సూర్యనారాయణ, పంచాయితీ సిబ్బంది నానిగిరి కృష్ణ, పింఛనుదార్లు పాల్గొన్నారు.

వ్యాపారాలు లేక బతకలేక పోతున్నాం ...

రైతుబజారుకు వెళ్లే రోడ్డుపై కొందరు అనధికారికంగా వ్యాపారాలు జరిపి మా పొట్టకొడుతున్నారు...

పబ్లిక్ గ్రీవెన్స్లో రైతు బజార్ వ్యాపారుల ఫిర్యాదు

విశాలాంధ్ర-రాజాం: పట్టణంలోని రైతుబజార్లో వ్యాపారం చేస్తున్న వ్యాపారులు తమ బ్రతుకులు పోయే పరిస్థితి ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ ఏ. ని కలిసి తమ సమస్యలను వివరించారు. వ్యాపారులు తెలిపిన వివరాల ప్రకారం... రైతు బజార్ బయట రహదారులపై అనధికారికంగా కాయగూరల వ్యాపారం జరుగుతుండడంతో రైతు బజార్కు వచ్చే కొనుగోలుదారుల సంఖ్య రోజురోజుకు తగ్గిపోతోందని తెలిపారు. దీంతో తమ వ్యాపారం తీవ్రంగా నష్టపోతుండటమే కాకుండా, దినసరి ఆదాయం కూడా తగ్గిపోయి జీవనం కష్టసాధ్యమైందని ఆవేదన వ్యక్తం చేశారు. "మా కుటుంబాలు పూర్తిగా రైతు బజార్ అమ్మకాలపైనే ఆధారపడి ఉంటాయి. కానీ బయట రోడ్డుపై కూరగాయలు అమ్మేవారిని ఎవరూ ఆపకపోవడంతో మా దగ్గర వ్యాపారం నిలిచిపోయింది. ఇలా కొనసాగితే మా బ్రతుకులు పోతాయి," అని వ్యాపారులు కమిషనర్ కి వినతిపత్రాన్ని అందించారు. బయట విక్రేతలను నియంత్రించి, రైతు బజార్కు వచ్చే రద్దీని పునరుద్ధరించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరారు. అధికార యంత్రాంగం దిగివచ్చి పరిష్కారం చూపితేనే తమ జీవనోపాధి కాపాడబ దుతుందని వ్యాపారులు భావిస్తున్నారు. కమిషనర్ వారి సమస్యను శ్రద్ధగా విని, సంబంధిత అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు రైతు బజార్లో వ్యాపారస్తులు తెలిపారు.

ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్న రవాణా విధానాలపై చర్యలేవి?: ఏఐవైఎఫ్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్న రవాణా విధానాలపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూర వాసు డిమాండ్ చేశారు దీనికి సంబంధించి సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ప్రాణాలకు ప్రమాదం కలిగిస్తున్న రవాణా విధానాలపై తక్షణ నియంత్రణ చర్యలుతీసుకోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేట్ ట్రావెల్స్, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాల , కళాశాల వాహన ఫిట్నెస్ నిబంధనలు పాటించకుండా, అధిక సంఖ్యలో విద్యార్థులను రవాణా చేస్తున్నారన్నారు. ఈ బస్సుల్లో చాలా వరకుఫిట్నెస్ సర్టిఫికేట్లు లేకుండా నడుపుతున్నారన్నారు.పాతవి, మరమ్మతులు చేయని ప్రమాదకర వాహనాలు ఉన్నాయన్నారు. ఇలాంటి నిర్లక్ష్యం కారణంగా ఇటీవల రాష్ట్రంలో జరిగిన పలు ప్రమాదాలు విద్యార్థుల ప్రాణాలకు ముప్పు ఏర్పడిందన్నారు. కావున ఫిట్నెస్ లేకుండా నడుస్తున్న వాహనాలపై తనిఖీలు నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని విద్యాసంస్థలకు రవాణాపై మోటార్ వెహికల్ యాక్ట్ నిబంధన తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వాలన్నారు. విద్యార్థుల రక్షణ కోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక రోడ్డు భద్రతా కమిటీ తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి వెలగాడ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అండర్-19 రాష్ట్ర స్థాయి కోకో పోటీల్లో మెరిసిన శ్రీ వేద జూనియర్ కాలేజ్ విద్యార్థులు

నేషనల్కు ఎంపికైన దివ్యశ్రీ

విశాలాంధ్ర-గరివిడి: గరివిడి మండలం శ్రీవేద జూనియర్ కాలేజీ విద్యార్థినులు రాష్ట్ర స్థాయిలో మరోసారి ప్రతిభ చాటారు. ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం చదువుతున్న నాగళ్ళ వలసకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ు బూరి దివ్యశ్రీ, పొట్నూరు థెరిస్సా, చనమల లావణ్య ు అండర్%-%19 కోకో రాష్ట్ర స్థాయి పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించి జిల్లా గర్వకారణంగా నిలిచారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ సిహెచ్. రమేష్ నాయుడు, అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది ముగ్గురు విద్యార్థినులను అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లోనూ మంచి ప్రతిభ కనబరిచిన వీరి విజయం అందరికీ ఆదర్శమని ప్రశంసించారు.ఇకపై జరగనున్న జాతీయ స్థాయి కోకో పోటీలకు బూరి దివ్యశ్రీ ఎంపిక కావడం కళాశాలకు, మండలానికి గర్వకారణమైందని ప్రిన్సిపాల్ తెలిపారు. జిల్లా తరఫున జాతీయస్థాయిలో ప్రతిభ కనబరచాలని ఆశాభావం వ్యక్తం చేశారు..

ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులను ఎమ్మెల్యే అభినందనలు

విశాలాంధ్ర-బొబ్బిలి : ఒడిస్సా రాష్ట్రం, బరంపూర్ లో ఎన్ఐ ఎస్టి యూనివర్సిటీ లో ఈ నెల 8, 9వ తేదీలలో జరిగిన ఓపెన్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్షిప్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, బొబ్బిలి పట్టణానికి చెందిన క్రీడాకారులు వివిధ విభాగాలలో. వెయిట్ కేటగిరీలో పాల్గొని పతకాలు సాధించిన క్రీడాకారులను ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్. కె.కె.రంగా రావు (బేబీ నాయన) విజేతలను బొబ్బిలి కోటలో అభినందించారు.కోచ్ ఎం.సుధాకర్ యాదవ్ గారు మాట్లాడుతూ, ఈ పోటీలకు జాతీయ స్థాయిలో సుమారు 900 మంది క్రీడాకారులు పాల్గొనగా, ఫైటింగ్ స్పీడ్ కిక్కింగ్" విభాగాలలో మన బొబ్బిలి క్రీడాకారులు పది బంగారు, అది బ్రోంజాస్, ఐదు సిల్వర్ పథకాలను సాధించినట్లు కోచ్ తెలిపారు.

రాజాంలోకి విశాలాంధ్ర మొబైల్ బుక్హౌస్ వాహనం

- డిస్కౌంట్ ధరలకు వివిధ రకాల పుస్తకాల విక్రయాలు
- 2 రోజులపాటు పాఠకులకు అందుబాటులోకి

విశాలాంధ్ర-రాజాం: రాజాం పట్టణంలో పుస్తకాభిమానులకు శుభవార్త. ప్రముఖ ప్రచురణ సంస్థ విశాలాంధ్ర బుక్ హౌస్ తమ ప్రత్యేక పుస్తక వాహనంతో మంగళవారం, బుగవారం రెండు రోజుల పాటు రాజాంలో సందర్శనకు రానున్నట్లు సంస్థ ప్రతినిధులు ప్రకటించారు. మొదటి రోజు పాలకొండ రోడ్డులో, రెండవరోజు పోలీస్ కోటర్స్ ఎదురుగా ఏర్పాటు చేయుచున్నారు. పాఠకుల తీరని పుస్తక అవసరాలను తీర్చడానికి, నాణ్యమైన సాహిత్యాన్ని అందుబాటులోకి తీసుకురావడానికి ఈ పుస్తక వాహన యాత్రను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మొబైల్ బుక్ వాన్లో సాహిత్యం, నవలలు, కథా సంపుటాలు, కవితా సంకలనాలు, చరిత్ర-సాంస్కృతిక పుస్తకాలు, పిల్లల పుస్తకాలు, పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు, వ్యక్తిత్వ వికాసంపై గ్రంథాలు వంటి విభిన్న విభాగాలకు చెందిన పుస్తకాలు విస్తృతంగా లభ్యమవనున్నాయి. ప్రత్యేక రాయితీలు కూడా అందుబాటులో ఉండే అవకాశముందని బుక్ హౌస్ ప్రతినిధులు తెలిపారు. పుస్తక ప్రేమికులు, మేధావులు, యువత, విద్యార్థులు, విద్యార్థినులు, కవులు తప్పక ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరుతూ, ఇటువంటి కార్యక్రమాలు పుస్తక పఠనాన్ని ప్రోత్సహించడంలో పెద్ద పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. స్థానిక పాఠకులు పెద్ద సంఖ్యలో హాజరై పుస్తకాలను కొనుగోలు చేసి, సాహిత్యాన్ని మరింత చేరువ చేసుకోవాలని ప్రతినిధి తెలిపారు.

ఎంఈఓ పాఠశాల సందర్శన

విశాలాంధ్ర-వేపాడ : మండల పరిధిలోని పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు, వసతులను ప్రత్యక్షంగా పరిశీలించే కార్యక్రమంలో భాగంగా మండల విద్యాశాఖాధికారి పి. బాల భాస్కరరావు, బక్కునాయుడు పేట మరియు కేజీబీవీ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్శన సందర్భంగా పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, స్టోర్ రూమ్, వంటగది స్వచ్ఛతను ఆయన పరిశీలించారు.అనంతరం జరుగుతున్న ఎస్ ఏ-1 సోషల్ స్టడీస్ పరీక్షను పర్యవేక్షించి ప్రశ్నపత్రాల నిర్వహణ, విద్యార్థుల రాతప్రతులను పరిశీలించారు. పరీక్షలు సజావుగా జరుగుతున్న తీరు పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.తరువాత మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించిన విద్యాధికారి,వంటగది పరిశుభ్రత,ఆహారం నాణ్యత పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాలల ప్రిన్సిపాళ్లు ఆర్.ఈశ్వరరావు, ఎ. కిరణ్మయి, సిఆర్ఎంటి తదితరులు పాల్గొన్నారు.

అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

విశాలాంధ్ర-గరివిడి : స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో సోమవారం ఉదయం జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో ఫాదర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ ఎస్.ఆర్. రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు అర్పించి నివాళులర్పించారు.తరువాత లైబ్రేరియన్ కె. క్రాంతి విద్యార్థులకు డిజిటల్ వనరులు, ఈ-బుక్స్, ఈ-జర్నల్స్, ఆన్‌లైన్ రిఫరెన్స్‌లు వంటి ఆధునిక గ్రంథాలయ సేవలపై అవగాహన కల్పించారు. అలాగే వివిధ విభాగాలకు సంబంధించిన పుస్తకాలు, మ్యాగజైన్స్, కాంపిటేటివ్ ఎగ్జాంలకు ఉపయోగపడే పుస్తకాలు, మోటివేషనల్ బుక్స్‌ను ప్రత్యేక ప్రదర్శనగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జె. బాల భాస్కరరావు మాట్లాడుతూ "పుస్తకం ఒక మంచి గురువు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, జ్ఞానవృద్ధికి, భవిష్యత్తు నిర్మాణానికి గ్రంథాలయం కీలక భూమిక పోషిస్తుంది" అని పేర్కొన్నారు. టెక్నాలజీ ఎంత అభివృద్ధి చెందినా పుస్తక పఠనం ఆప్షన్ కాదు, అవసరమని విద్యార్థులకు సూచించారు. ప్రతి విద్యార్థి గ్రంథాలయ వినియోగాన్ని పెంచుకోవాలని, పఠనాభిరుచి పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ బి. వెంకటరమణ, ఏఓ జి. అనిల్‌కుమార్, విభాగాధిపతులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

రాజాంలో కవి అందెశ్రీ కి ఘన నివాళి

విశాలాంధ్ర-రాజాం: స్థానిక బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో కవి గాయకుడు అందెశ్రీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరజాన నీలయ్య మాస్టారు, బొత్స బుద్ధుడు మాస్టారు మాట్లాడుతూ అందెశ్రీ (1961 జూలై 18 న పుట్టి 2025 నవంబరు 10 మరణించారు అని తెలంగాణ రచయిత. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ గీతం రచించారు. అందెశ్రీ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించినందుకుగాను 2025 జూన్ 2న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతులమీదుగా రూ.కోటి నగదు పురస్కారాన్ని కూడ అందుకున్నారు అని సామాజిక అంశాల మీద ఎన్నో పాటలు రచించి తన గొంతుతో వినిపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో నాగాపు తవిటయ్య, తెగల మోహన్ పాల్గొన్నారు.

మాల మహానాడు -అండ్ రాక్స్ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా సూర్యనారాయణ నియామకం

విశాలాంధ్ర-రాజాం: మాల మహానాడు మరియు అండ్ రాక్స్ సంస్థ ఉత్తరాంధ్ర రీజనల్ కోఆర్డినేటర్‌గా రాజాం పట్టణానికి చెందిన ప్రముఖ దళిత నాయకుడు, సీనియర్ జర్నలిస్ట్ గుడివాడ సూర్యనారాయణ నియమితులయ్యారు. దళిత సమస్యలపై కఠినమైన పోరాటం, సామాజిక సేవలో ఆయన చూపిన అంకితభావం దృష్ట్యా ఈ బాధ్యతలు అప్పగించడం విశేషంగా నిలిచింది. సూర్యనారాయణ పలు దళిత సంఘాలకు ప్రాతినిధ్యం వహిస్తూ, సామాజిక న్యాయం, విద్య, సంక్షేమ కార్యక్రమాల్లో ముందుండి పని చేస్తున్నారు. ఆయన నియామకంతో ఉత్తరాంధ్రలో సంస్థ కార్యకలాపాలు మరింత వేగవంతం కానున్నాయని నాయకత్వ వర్గాలు అభిప్రాయపడ్డాయి. ఈ సందర్భంగా పలువురు దళిత సంఘాలు, సామాజిక కార్యకర్తలు సూర్యనారాయణ బాధ్యతలు స్వీకరణ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు. రాజాం ప్రెస్‌క్లబ్ జర్నలిస్టులు కూడా ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

తాగునీటి బోర్ ఏర్పాటుకు భూమి పూజ

విశాలాంధ్ర-నెల్లిమర్ల/విజయనగరం టౌన్ : నెల్లిమర్ల నగర పంచాయతీ జరజాపు పేటలోని జగనన్న కాలనీకి 2.70 లక్షల రూపాయలతో మంజూరైన తాగునీటి బోరు ఏర్పాటుకు నగర పంచాయతీ చైర్పర్సన్ బంగారు సరోజిని, ఆ గ్రామానికి చెందిన వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, గ్రామ పెద్దలు సోమవారం భూమి పూజ చేశారు. గత సంవత్సరం కాలం నుంచి తాగునీటి సమస్యతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో వైస్ చైర్మన్ సముద్రపు రామారావు పలువురు గ్రామ పెద్దలతో కలిసి జిల్లా కలెక్టర్ వారిని కలిసి సమస్య పరిష్కారం కోసం అభ్యర్థన మేరకు పబ్లిక్ హెల్త్ %c% హౌసింగ్ డిపార్ట్మెంట్లు నుండి జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేశారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ డి.ఈ. ఈశ్వర్, గృహ నిర్మాణ శాఖ ఏఈ పవన్ కుమార్ పరిశీలనతో సోమవారం బోరు ఏర్పాటుకు ముహూర్తం నిర్ణయించారు. భూమి పూజ అనంతరం పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా బంగారు సరోజిని, సముద్రపు రామారావు లు మాట్లాడుతూ కాలనీలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని, ఫినాయిల్లు నిర్మించిన వారు త్వరగా పూర్తి ఇల్లును నిర్మించుకోవాలని, రాష్ట్ర ప్రభుత్వం అదనంగా 50 వేల రూపాయలు ఇస్తుందని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అవనాపు సత్యనారాయణ, రాష్ట్ర నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ కళ్ళ సత్యవతి, ఏఎంసీ డైరెక్టర్ ఎమ్.ఎమ్. నాయుడు , కౌన్సిలర్ బంగారు %c% గ్రామ పెద్దలు లక్ష్మి శ్రీను, తుమ్ము నారాయణమూర్తి, బంగారి శంకర్రావు,కళ్ల రాజశేఖర్, మాత మురళీమోహన్, దోమ నాగ్గున్న,నల్లి శివ ప్రసాద్, కొంకి సంతోష్, గౌరవ కమిషనర్ టి. జైరామ్, పబ్లిక్ హెల్త్ డి.ఈ.ఈశ్వర్ గృహనిర్మాణ ఏ.ఈ పవన్ కుమార్, హౌసింగ్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పిటిషన్ లు సంతృప్తి కరంగా పరిష్కరించబడాలి

ప్రీ ఆడిట్ ఖచ్చితంగా జరగాలి : కలెక్టర్



విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : అర్జీదారు సమస్యను పూర్తిగా అర్థం చేసుకోవాలని, వారు చెప్పే విషయాన్ని ఓపిగ్గా వినాలని అప్పుడే వారికి సంతృప్తి కలుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.రామ్ సుందర్ రెడ్డి తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పిజిఆర్ఎస్ వినతుల పై కలెక్టర్ సమీక్షించారు. వినతులపై స్వయంగా సంబంధిత అధికారే ఎండార్స్మెంట్ చేయాలని, క్రింది స్థాయి అధికారులకు అప్పజెప్ప కూడదని తెలిపారు.ప్రీ ఆడిట్ లో ప్రవర్తనావరణ లోపాలు, పద్ధతిని అనుసరించే విధానం పై కలెక్టరేట్ కాల్ సెంటర్ నుండి ఆడిట్ టీమ్ అర్జీదారులతో మాట్లాడి ఫోన్ ద్వారా తెలుసుకోవడం జరుగుతుందని, వారు చెప్పిన విషయాన్ని వాస్తవాలను పరిశీలించాలని తెలిపారు. అనంతపు శాతం ఎక్కువగా ఉన్న మండలాల తహశీల్దార్ల వద్ద నున్న అర్జీలను మండల ప్రత్యేకాధికారులు సమీక్షించి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. సచివాలయ ఉద్యోగుల హాజరుపై పర్యవేక్షించాలని ఎంపీడీఓ లను ఆదేశించారు.ఈ సమావేశంలో డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, డిప్యూటీ కలెక్టర్ మురళి, పాల్గొన్నారు.

మనోబంధు ఫౌండేషన్ చేస్తున్న సేవలు అమోఘం...

సంస్థను అభినందించిన నగరపాలక సంస్థ కమిషనర్ నల్లనయ్య

విశాలాంధ్ర-విజయనగరం : మతిస్థిమితం కోల్పోయిన వారిని మనో బంధు ఫౌండేషన్ అక్కున చేర్చుకుని, ఆదరిం చడం గొప్ప విషయమని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య అన్నారు. ఈ మేరకు సోమవారం మనోబంధు ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా రూపొందించిన పోస్టర్లను కమిషనర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనోబంధు ఫౌండేషన్, రెడ్ క్రాస్ సొసైటీ సంయుక్తంగా మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరుగుతున్న వారిని గుర్తించి వారికి సపర్యలు చేసి అవసరమైన వైద్యాన్ని, మానసిక స్థైర్యాన్ని అందించేందుకు ముందుకు వచ్చారని అన్నారు. ఏ ఒక్క మానసిక రోగి రోడ్లపై సంచరించకూడదని, అందరూ సురక్షితంగా ఆసుపత్రిలో లేదా నిరాశ్రయుల కేంద్రాలలో గాని ఉండాలనే సంస్థ లక్ష్యమని తెలియజేయడం సంతోషదాయకం అన్నారు. మరింతగా సేవలు అందించి గుర్తింపు తెచ్చుకోవాలని సంస్థకు శుభాకాంక్షలు తెలిపారు.

మిడ్డే మీల్స్, స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: మిడ్ డే మీల్స్ మరియు స్కూల్ స్వీపర్ల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులు సోమవారం మండల విద్యా వనరుల కేంద్రం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ మాట్లాడుతూ. నిత్యావసర సరుకుల ధరలు ప్రతిరోజు పెరుగుతున్నాయని గ్యాస్ ధర కూడా పెరిగిందని ధరలు పెరగడం వలన పిల్లలకు నాణ్యమైన భోజనం పెట్టడం కష్టంగా మారిందని దానికి తోడు బిల్లులు సకాలంలో చెల్లించగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని 2019 లో నిర్ణయించిన గౌరవ వేతనాన్ని నేటికీ అమలు చేయడంతో కుటుంబం గడవటం కష్టంగా మారిందని అన్నారు. కావున తమ నాణ్యమైన డిమాండ్ అయిన రూ 10,000 లు జీతం ఇవ్వాలని, సంవత్సరానికి ఒక జత కాటన్ దుస్తులు ఇవ్వాలని, తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలని, ప్రమాద బీమా 10 లక్షలు ఇవ్వాలని, సకాలంలో బిల్లులు చెల్లించాలని రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేస్తూ ఎంఈఓ నర్సింగరావు, ఎంఈఓ 2 పాదం లక్ష్మికి వినతి పత్రాన్ని అందజేశారు ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు ముత్యాలు, కార్మికులు రవణమ్మ, దేవుడమ్మ, పద్మ, అచ్చియమ్మ, గౌరీ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రామభద్రపురం : జీవనం ఒక వ్యక్తి రోడ్డు ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున విజయనగరం కేంద్ర ఆస్పత్రిలో మృతి చెందాడని ఎస్ఐ వి.ప్రసాదరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మన్యం జిల్లా సాలూరు పెద హరిజన వీధికి చెందిన బొంగు రవి 58సం చీపురుపల్లి దగ్గర కద్దం గ్రామంలో ఒక కోళ్ల ఫారం లో దినసరి కూలిగా పనిచేస్తున్నాడు. ఈయన భార్య గౌరీ కుమార్తె కలిసి ఆదివారం ఆయన కలవడానికి వెళ్లారు. ఆదివారం సాయంత్రం భార్య గౌరీ కుమార్తె కలిసి బస్సులో సాలూరు బయలుదేరారు. రవి ఒక్కడే ద్విచక్ర వాహనంపై సాలూరు వస్తుండగా రామభద్రపురం దాటిన తర్వాత సాయంత్రం 6 గంటల ప్రాంతంలో ఆరికతోట పంచాయతి కల్లాలపల్లవద్ద వచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి బైక్ అదుపు తప్పి రోడ్డు మీద పడ్డాడు. రవికి తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. గాయపడిన రవిని స్థానికులు సహాయంతో 108 లో బాడంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు అక్కడ ప్రాథమిక వైద్యము జరిపి మరింత మెరుగైన వైద్యం కొరకు విజయనగరం కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అక్కడ రవి చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మృతి చెందారు అని ఎస్ఐ అప్పారావు తెలిపారు. మృతుడి భార్య గౌరీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

కిడ్నీ బాధితునికి కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జేసీ రాజు ఆర్థిక చేయూత

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణానికి చెందిన ప్రముఖ సేవా సంస్థ కారుణ్య ఫౌండేషన్ మరో నిరుపేద కిడ్నీ వ్యాధి గ్రస్తునికి చేయూతనందించింది. పట్టణం అంట్యాకుల వీధికి చెందిన షేక్ షాజహాన్ గత కొంతకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతు విశాఖపట్నంలో చికిత్స తీసుకొని బొబ్బిలి వచ్చి వారానికి మూడు పర్యాయాలు పార్వతీపురం ఏరియా హాస్పిటల్ లో డయాలసిస్ చేయించుకుంటున్నారు. పేదవాడు కావటంతో వైద్య ఖర్చులు భరించలేక,భార్య ,బిడ్డల కుటుంబపోషణ కష్టముతున్నది. ఆర్థిక సమస్యలతో తీవ్ర ఆందోళన, ఆరోగ్యం సహకరించకపోవటంతో ఏమి చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్న షాజహాన్ పరిస్థితిని గమనించి పలువురు సేవా సంస్థ సభ్యులు కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ ను సంప్రదించి షేక్ షాజహాన్ దీన పైన పరిస్థితిని చెప్పటంతో తక్షణమే కారుణ్య సంస్థ చైర్మన్ జె సి రాజు సభ్యులు రమేష్, చిన్నారావు, శర్మ, రామకృష్ణలు స్పందించి 10 వేల రూపాయలు ఆ ట్యాక్ కుల వీధిలో వున్నా ఆయన నివాసానికి వెళ్లి సోమవారం బాధితుడు అందించారు. వచ్చేనెల మరో 10 వేల రూపాయలు అందిస్తామని జె సి రాజు తెలియ చేశారు. అలాగే హిందూముస్లిమ్ వెల్ఫేర్ సంస్థ ప్రతినిధులు రఫీ, జాఫర్ లు కూడా షాజహాన్ కు 5 వేల రూపాయలు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో షేక్ మీరాషేక్ సాఫి తదితరులు పాల్గొన్నారు.

సిటీయూలో బిర్సా ముండా 150వ జయంతిని పురస్కరించుకొని జాతీయ వర్క్ షాప్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ లో సోమవారంగిరిజన గౌరవ దినోత్సవం – 2025, భగవాన్ బిర్సా ముండా 150వ జయంతి సందర్భంగా డాక్యుమెంటేషన్ ఆఫ్ ట్రైబల్ నాలెడ్జ్ అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్‌షాప్ నిర్వహించింది. ఈ వర్క్‌షాప్ గిరిజన అధ్యయన విభాగం ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా గిరిజన అధ్యయనాల ఇంచార్జ్ విభాగాధిపతి డా. అనిరుద్ కుమార్ మాట్లాడుతూ.. గిరిజన పరిశోధన, ప్రజాకేంద్రిత ప్రాజెక్టులు ఉత్తరాంధ్ర ప్రాంత అభివృద్ధికి ఎంతో కీలక మన్నారు. ప్రొ. అంషుమాన్ బెహెరా, అకాడమిక్ హెడ్, స్కూల్ ఆఫ్ కాన్ఫ్లిక్ట్ %c% సెక్యూరిటీ స్టడీస్, నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ స్టడీస్ బెంగళూరు, జనజాతీయ గౌరవ దివస్ పై ప్రధాన ప్రసంగం అందించారు. గిరిజన జ్ఞాన వ్యవస్థల డాక్యుమెంటేషన్, సంరక్షణ, ప్రచారం పద్ధతులు, పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పన, శాస్త్రీయ వ్యాస రచన వంటి అంశాలనువివరించారు. కార్యక్రమానికి యూనివర్సిటీఉపకులపతి ప్రొ. టి. శ్రీనివాసన్, ప్రధాన అతిథి ప్రొ. అంషుమాన్ బెహెరా, రిజిస్ట్రార్ (ఇంచార్జ్) ప్రొ. జితేంద్ర మోహన్ మిశ్రా, డీన్ ప్రొ. శరత్‌చంద్ర బాబు, మరియు డా. అనిరుద్ కుమార్ సమక్షంలో ప్రారంభించారు.తదుపరి సెషన్లలో గిరిజన జ్ఞాన వ్యవస్థల డాక్యుమెంటేషన్, సంరక్షణ, ప్రచారం పద్ధతులు, పరిశోధన ప్రాజెక్టుల రూపకల్పన, శాస్త్రీయ రచన వంటి అంశాలపై చర్చించారు. డా. ప్రమా చటర్జీ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ధన్యవాదాలు తెలిపారు.ఈ వర్క్‌షాప్ డా. అనిరుద్ కుమార్ తద్వారా డా. దివ్య కె., డా. ప్రమా చటర్జీ సహకారంతో విజయవంతంగా నిర్వహించబడింది. అధ్యాపకులు, పరిశోధకులు, సిబ్బంది, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

సంగమేశ్వర స్వామి ఆలయంలో పోటెత్తిన భక్తులు

విశాలాంధ్ర-వంగర : పవిత్ర పుణ్యక్షేత్రం సంగమేశ్వర స్వామి ఆలయం కార్తీక మాసం ఆఖరు సోమవారం విపరీతమైన భక్తులు రావటం వల్ల భక్తులతో కిట,కిట లాడింది. ఆలయంలో ఆలయం చుట్టూంతే కాకుండా త్రివేణి సంగమంలో నదుల్లో భక్తులతో నిండిపోయాయి. రాష్ట్రం నలుమూలలు పలు ప్రాంతాల్లో నుంచి వచ్చిన భక్తులు స్వామి దర్శనానికి క్యూ లో గంటలు తరబడి వేచి చూస్తే తప్ప దర్శనం కలగే సాధ్యంకావటం లేదు.పోలీసు బందోబస్తు మధ్య భక్తులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేశవ జాము 3 గంటలు నుంచి రాత్రి వరకూభక్తులు పోటెత్తారు.ఈ రోజునఈశ్వరుని పూజించడమే కాకుండా ఈ రోజు మొత్తం శివ పంచాక్షరి మంత్రం ఓం నమః శివాయ అని జపిస్తూ భక్తులుఈశ్వరుని పూజించటం చేశారు.ఇలా చేస్తే మనమనసుకు ప్రశాంతత అందిస్తుందని ఈ విధంగా భక్తులు పూజలునుచేసి శివలయాన్ని సందర్శించి మారేడు, బిల్వ పత్రాలతోపూజించడం చేసి దీపారాధన చేస్తే ఆ శివుని అనుగ్రహం కలుగుతుంది.భక్తులు ముందుగాసువర్ణ ముఖి వేగావతి నాగావళి నదులు కలిసే త్రివేణి సంగమంలో స్నానాలు ఆచరించి అనంతరంశివలింగంకుపూజించటం ప్రతి ఒక్కరూ చేయటం అనవాయితీగావస్తుంది. భక్తి శ్రద్ధలతో పూజలు ఎంతో ఘనంగా చేసుకొంటూ స్వామి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఆలయం వద్ద భక్తులకు అన్న సమారాధన

సంగమేశ్వరుని దర్శించుకున్న భక్తులకు అన్న సమారాధన కార్యక్రమంనిర్వహించారు.డాక్టర్ ముత్యాల రావు వంగర స్టేట్ బ్యాంక్ మేనేజర్ తదితరులు ఈఅన్న సమారాధన కార్యక్రమాన్ని తమ స్వంతనిధులతో వేలాదిమంది భక్తులకు అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయఈఓ శ్యామలరావు, వంగర ఎస్ ఐ షేక్ శంకర్, ఏ ఎస్ ఐ వాళ్ళ సిబ్బంది,ఆలయ చైర్మన్ బోనులసందరావు, డాక్టర్ ముత్యాల రావు,ఆలయార్చకులు తదితరులు పాల్గొన్నారు. అంతే కాకుండా సంగమేశ్వరుని దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చేయటానికి వైద్య సేవలు అందించారు.వంగర ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది సంగమేశ్వర స్వామి ఆలయం వద్ద వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరాన్ని ఎంపీపీ సురేష్ ముఖర్జీ పరిశీలించారు. ..

ఎండల మల్లిఖార్జున స్వామి దేవాలయంలో మహా రుద్రాభిషేకం

అఘోరీ మహాసన్యాసుల సన్నిధితో కోటి దీపోత్సవం

విశాలాంధ్ర-రాజాం/రేగిడి : రేగిడి ఆమదాలవలస మండలం కొర్లవలస గ్రామ సమీపంలోని శ్రీశ్రీశ్రీ ఎండల మల్లిఖార్జున స్వామి దేవాలయం సోమవారం అరుదైన ఆధ్యాత్మిక దృశ్యానికి వేదికైంది. ఆలయ ట్రస్టు సభ్యులు శివ స్వామి ఆధ్వర్యంలో జరిగిన మహా రుద్రాభిషేకం మరియు అనంతరం ప్రారంభమైన కోటి దీపోత్సవం భక్తులను ఆధ్యాత్మిక మైకాలో ముంచెత్తాయి. ఈ మహోత్సవానికి దేశవ్యాప్తంగా పర్యటించే అతిధి అఘోరీ, నాగ సన్యాసుల రాక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముఖ్యంగా శ్రీశ్రీశ్రీ భువనేశ్వరి అఘోరీ (నల్లమల్ల అరణ్య సంచారకులు) శ్రీశ్రీశ్రీ శ్రీముఖ దుర్గనాథ అఘోరీమహానాథ అఘోరీ శ్రీశ్రీశ్రీ యోగి అతిథేశ్వర నంద స్వామి నాగ కన్య వారి సన్నిధిలో జరిగిన తంత్ర, మంత్రోచ్ఛారాలతో కూడిన రుద్రాభిషేకం దేవాలయాన్ని శివతత్వంతో మరింత దివ్యంగా మార్చింది. వారి ప్రత్యేక పూజలు, యజ్ఞోపచారాలు, తాంత్రిక విధులు అక్కడి వాతావరణాన్ని ఆధ్యాత్మిక తరంగాలతో అలుముకున్నాయి. ఆ తర్వాత భక్తుల వేలాది పోత్తులతో ప్రారంభమైన కోటి దీపోత్సవం క్షేత్రాన్ని వెలుగుల మహాసముద్రంగా మార్చింది. కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచే భక్తుల సందోహం అలుముకుంది. దీపాల వెలుగులు, గంటల నాదం, మంత్రోచ్ఛారాలు కలిసి ఆధ్యాత్మిక వైభవానికి కొత్త నిర్వచనం ఇచ్చాయి. ఈ ఏడాది ఎండల మల్లిఖార్జున క్షేత్రంలో జరిగిన మహా రుద్రాభిషేకం – కోటి దీపోత్సవం అపూర్వ ఆధ్యాత్మిక దృశ్యంగా, భక్తుల హృదయాల్లో చిరస్మాయిగా నిలిచిపోయే ఉత్సవంగా మారింది.

ఫిర్యాదుదారులకు న్యాయం చేసేందుకు చట్టపరిధిలో చర్యలు

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" (పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం) కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించారు. ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించిన జిల్లా ఎస్పీగారు వారి సమస్యలను శ్రద్ధగా విని, సంబంధిత పోలీసు అధికారులతో మాట్లాడి, ఫిర్యాదుదారుల సమస్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఫిర్యాదుదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించాలని, ఫిర్యాదుల పరిష్కారానికి చట్ట పరిధిలో చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. పి జి ఆర్ ఎస్ కు ఫిర్యాదు చేసేందుకు జిల్లా పోలీసు కార్యాలయంకు వచ్చిన ఒక వృద్ధునితో జిల్లా ఎస్పీ అప్యాయంగా మాట్లాడి, కుశల ప్రశ్నలు వేసి, ఆతడి ఆరోగ్య స్థితి, జీవనోపాధి గురించి అడిగి తెలుసుకున్నారు.పబ్లిక్ గ్రీవియన్స్ రిడ్రెసల్ సిస్టం ద్వారా జిల్లా ఎస్పీ 29 ఫిర్యాదులను స్వీకరించారు. ఆయా ఫిర్యాదుల్లో భూతగాదాలకు సంబంధించినవి 11, కుటుంబ కలహాలకు సంబంధించినవి 6, మోసాలకు పాల్పడినట్లు 3, నగదు వ్యవహారాలకు సంబంధించి 1, ఇతర అంశాలకు సంబంధించినవి 8 ఫిర్యాదులు ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులు ఫిర్యాదు అంశాలను పరిశీలించాలని, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాల్లో వాస్తవాలను గుర్తించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. "ప్రజా సమస్యల పరిష్కార వేదిక" ద్వారా స్వీకరించిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలని, 7 దినాల్లో ఫిర్యాదుదారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాల న్నారు. ఫిర్యాదులపై తీసుకున్న చర్యల వివరాలను నివేదిక రూపంలో జిల్లా పోలీసు కార్యాలయానికి పంపాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ పి.సౌమ్యలత, ఎస్బి సిఐ ఎ.వి.లీలారావు, డిసిఆర్బి ఎస్ఐలు రాజేష్, ప్రభావతి, సిబ్బంది పాల్గొన్నారు.

ఖరీఫ్ పంట నమోదు ప్రక్రియ ముమ్మరం

గ్రామసభల్లో భారీగా రైతుల స్పందన

విశాలాంధ్ర-వేపాడ : మండలంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 2025 ఖరీఫ్ పంట నమోదు కార్యక్రమం వేగవంతంగా కొనసాగుతోందని ఏఓ ఎం.స్వాతి అన్నారు. గత మూడు రోజులుగా మండలంలోని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి, రైతుల నుండి సోషల్ ఆడిట్‌కు సంబంధించిన ఫిర్యాదులు, అభిప్రాయాలు స్వీకరిస్తున్నారు. ప్రతి గ్రామంలో రైతులు పాల్గొనడం విశేషంగా కనిపిస్తోంది.అధికారులు రైతులకు సూచిస్తూ మీ పంట నమోదు,వివరాలను సంబంధిత గ్రామ,సచివాలయం లేదా రైతు సేవా కేంద్రంలో తప్పకుండా చెక్ చేసుకుని,పంట నమోదు ప్రక్రియకు సహకరించాలని తెలిపారు. ఈనెల 19న అన్నదాత సుఖీభవ రెండో విడత,రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం చేపట్టిన అన్నదాత సుఖీభవతో పాటు పీఎం కిసాన్ రెండో విడత మొత్తాలను సీఎం నారా చంద్రబాబు నాయుడు ఆన్లైన్ ద్వారా రైతుల ఖాతాల్లో జమ చేయనున్నారు.ఈ కార్యక్రమాన్ని మండలం వ్యాప్తంగా అందరి రైతు సేవా కేంద్రాల్లో లైవ్ టెలికాస్ట్ చేస్తూ స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి గారి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. అధికారులు రైతులందరూ తమ సమీప రైతు సేవా కేంద్రాల్లో కార్యక్రమాన్ని వీక్షించడానికి హాజరవ్వాలని ఏఓ ఎం.స్వాతి కోరారు.

మతిస్థిమితం లేని వ్యక్తుల సమాచారాన్ని మనోబంధు ఫౌండేషనుకు అందించండి

ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: జిల్లాలో రోడ్లపై మానసిక రుగ్మతలతో బాధపడుతూ, ఆదరించేవారు లేకుండా నిరాశ్రయులైన మతిస్థిమితం లేని వ్యక్తులకు తమవంతు సహకారాన్ని, సహాయాన్ని అందించేందుకు 'మనోబంధు ఫౌండేషన్' ముందుకు వచ్చినట్లుగాజిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ తెలిపారు. మనోబంధు ఫౌండేషను సభ్యులు ప్రత్యేకంగా రూపొందించిన వాల్ పోస్టర్లను జిల్లా పోలీసు కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్, ఐపిఎస్ మాట్లాడుతూ – మతి స్థిమితం లేకుండా నిరాశ్రయులై రహదారులపై సంచరిస్తున్న వ్యక్తులకు సహాయాన్ని అందించేందుకు 'మనోబంధు ఫౌండేషన్' అనే స్వచ్ఛంద సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ స్వచ్ఛంద సంస్థ సభ్యులు జిల్లాలో రెడ్ క్రాస్ సంస్థ భాగస్వామ్యంతో కార్యాచరణ చర్యలు చేపడుతుందన్నారు. కావున, ప్రజలు తమకు కనిపించిన మానసిక రుగ్మతలతో బాధపడి, నిరాశ్రయులైరహదారులపై సంచరిస్తున్న వ్యక్తుల సమాచారాన్ని మనోబంధు ఫౌండేషను ఫోను నంబరు 9246563738 అందించాలని కోరారు. మనోబంధు ఫౌండేషను , రెడ్ క్రాస్ సభ్యులు మతిస్థిమితం లేని వ్యక్తులను హెల్ప్ కేంద్రాలకు తరలించడం, అవసరమైన చికిత్స అందిస్తారన్నారు. సంస్థ సభ్యులు చేపట్టే కార్యకలాపాలకు అవసరమైతే పోలీసుల సహాయాన్ని అందిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సెక్రటరీ కె.సత్యం, మెడికల్ ఆఫీసర్ డా.సిహెచ్. పి.వేణుగోపాల్ రెడ్డి, బి.వి.గోవిందరాజులు, సిహెచ్. మన్మథరావు, బాల సురేష్, టి.రామకృష్ణరావు, నారాయణరావు పాల్గొన్నారు.

స్టాపర్లను ధ్వంసం చేసిన నిందితుడికి ఆరు మాసాలు జైలు

జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : గంట్యాడ పోలీసు స్టేషను పరిధిలో రహదారి ప్రమాదాల నియంత్రణకు ఏర్పాటు చేసిన స్టాపర్లను ధ్వంసం చేసినందుకు గాను నిందితుడు భీమునిపట్నం మండలం గొల్ల తాళ్లవలస గ్రామానికి చెందిన కోల వెంకట హేమంత్ కుమార్ (27 సం.లు)కు ఆరు మాసాల జైలుశిక్ష విధిస్తూ గంట్యాడ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పొన్నారు బుజ్జి నవంబరు 17న తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ హెచ్చరించారు.భీమునిపట్నం మండలం గొల్ల తాళ్లవలస గ్రామానికి చెందిన కోల వెంకట హేమంత్ కుమార్ (27 సం.లు) అనే వ్యక్తి గంట్యాడ – బొడ్డవర మధ్య రహదారి ప్రమాదాలను నియంత్రించేందుకు ఏర్పాటు చేసిన స్టాపర్లను 2022 సం.లో తన వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి, స్టాపర్లు ఢీ కొట్టి, ధ్వంసం చేసారన్న కారణంతో అప్పటి గంట్యాడ ఎస్ఐ కె.కె.కే.నాయుడు కేసు నమోదు చేసి, నిందితుడిపై న్యాయస్థానంలో అభియోగ పత్రం దాఖలు చేసారన్నారు.ఈ కేసు విచారణ సమయంలో నిందితుడిపై నేరారోపణలు రుజువు కావడంతో జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ పొన్నారు బుజ్జి ఆరు మాసాలు జైలుశిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారన్నారు. ఈ కేసులో పోలీసువారి తరుపున ఏపిపి విజయలక్ష్మి వాదనలు వినిపించగా విజయనగరం రూరల్ సిఐ బి.లక్ష్మణరావు, గంట్యాడ ఎస్ఐ డి.సాయికృష్ణ ప్రాసిక్యూషను పర్యవేక్షించగా, కోర్టు కానిస్టేబులు జి.శాంతారావు, రాధికలు సాక్షులను సకాలంలో ప్రవేశపెట్టారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ తెలిపారు. నిందితుడికి శిక్షపడే విధంగా ప్రాసిక్యూషను పర్యవేక్షించిన ఏపిపిని, పోలీసు అధికారులు, సిబ్బంది జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్ అభినందించారు.

అంగరంగ వైభవంగా శ్రీ గౌరీ పరమేశ్వరుల నిమజ్జన మహోత్సవం

పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని బానాది గ్రామం సోమవారం భక్తిరసంతో నిండిపోయింది. సకల జనులను ఆకట్టుకున్న, కోరికలు తీర్చే శ్రీశ్రీశ్రీ గౌరీ పరమేశ్వరుల నిమజ్జన మహోత్సవం ఈసారి అంగరంగ వైభవంగా, ఆధ్యాత్మికంగా నిర్వహించబడింది. టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, ఎంపీటీసీ గొంప తులసీల ఆధ్వర్యంలో జరిగిన ఈ మహోత్సవానికి వేలాదిమంది భక్తులు వాహనాలు, కవాతులు, వాయిద్యాలతో తరలివచ్చారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన నిమజ్జన వేడుకల్లో భక్తులు మొక్కులు చెల్లించుకునేందుకు, నైవేద్యాలు సమర్పిస్తూ గౌరీ పరమేశ్వర శరణం అంటూ గోస పెట్టారు.గ్రామ పురవీధుల డప్పుల నాదం, మహిళల కోలాటాలతో పండుగ వాతావరణాన్ని మరింత అద్భుతంగా మార్చింది. ఘనమైన ఊరేగింపుతో గౌరీ పరమేశ్వరులను గ్రామం నలుమూలలు తీసుకెళ్లి దర్శన భాగ్యం కల్పించారు.ఈ సందర్భంగా గా స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ గౌరీ పరమేశ్వరుల దర్శనం, అర్చన కార్యక్రమాల్లో పాల్గొని వేదపాఠాల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి 9 గంటల నుండి విశాఖ శంకర్ మ్యాట్రిక్స్ వారి డ్యాన్స్ బేబీ డ్యాన్స్, రేలా రేలారే, బాలనాగమ్మ బుర్రకథలు ప్రదర్శనలు ప్రేక్షకులను అలరించాయి. కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన మంచు గండం పెట్టెలు, రంగురంగుల పటాకుల భారీ ప్రదర్శన యువతను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఏవిధమైన అనపూహితాలు జరగకుండా వల్లంపూడి ఎస్ఐ ఎస్. సుదర్శన్ పర్యవేక్షణలో గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం విశేషం.మండలం అంతటా ప్రత్యేకించి 29 గ్రామ పంచాయతీల నుంచి వచ్చిన టిడిపి నాయకులు, కార్యకర్తలు, భక్తుల సమూహం ఈ నిమజ్జన మహోత్సవాన్ని విజయవంతం చేసింది.ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు గొంప వెంకటరావు ఏర్పాటు చేసినవిందుభోజనాలు అందరినీ ఆకట్టుకుని ప్రశంసలు అందుకున్నాయి.బానాది గ్రామంలో జరిగిన ఈ గౌరీ పరమేశ్వరుల నిమజ్జన మహోత్సవం భక్తి, భక్తికల నిండిన ఆధ్యాత్మికోత్సవంగా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది.

వీలుపర్తిలో భక్తుల సందడి...

కార్తీక వనభోజనానికి వేలాది మంది భక్తుల హాజరు

విశాలాంధ్ర-వేపాడ: మండలంలోని వీలుపర్తి గ్రామం సోమవారం భక్తజనులతో సందడి నెలకొంది. గ్రామ సర్పంచ్ శానాపతి లీల అప్పారావు ఆధ్వర్యంలో కార్తీక మాసం నాలుగో సోమవారం సందర్భంగా నిర్వహించిన వనభోజన కార్యక్రమానికి వేలాదిమంది భక్తులు హాజరై ఘనంగా సమారాధనలో పాల్గొన్నారు.గ్రామంలోని శ్రీశ్రీశ్రీ పైడితల్లమ్మ ఆలయ పరిసరాల్లో ఏర్పాటు చేసిన ఈ వనభోజనంలో గ్రామ పెద్దలు, యువకులు, మహిళలు, స్వచ్ఛంద సేవకులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతంచేశారు.అంతేకాకుండా చుట్టుపక్కల గ్రామాలైన వావిలపాడు, చామలాదేవి, అగ్రహారం, కొలికిపాలెం, పెదదుంగాడ,చినదుంగాడ, బొర్రవలస తదితర ప్రాంతాల నుండి కూడా భక్తులు భారీగా తరలి వచ్చి ప్రసాదాలను స్వీకరించారు.సంప్రదాయ పద్ధతిలో నిర్వహించిన ఈ వనసమ్మారాధన వీలుపర్తి గ్రామాన్ని కార్తీక భక్తిరసంతో నింపింది.గ్రామస్తుల సహకారం, స్థానిక యువత సేవాభావం కారణంగా కార్యక్రమం అంతటా శోభాయమానంగా కొనసాగిందని నిర్వాహకులు తెలిపారు.

ఆనందపురం గ్రామంలో భారీ ఐసు లింగం దర్శనం

శివాలయంలో భక్తుల సందడి

విశాలాంధ్ర-గుర్ల: మండలం ఆనందపురం గ్రామంలో అద్భుతమైన భక్తి ఘట్టం చోటుచేసుకుంది. స్థానిక శివాలయంలో భారీ ఐసు లింగం తో గ్రామమంతా భక్తి విలాసంతో కళకళలాడింది. శివాలయం వద్ద అయ్యప్పస్వాములు, భవానీల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించగా, ఈ అరుదైన దైవ దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శివాలయం పరిసరాలు భక్తిశోభాతో కలకలాడింది.చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు "ఓం నమశ్శివాయ" నినాదాలతో ఆలయ ప్రాంగణాన్ని మార్మోగించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిరంతరంగా భక్తుల రద్దీ కొనసాగింది. కుటుంబాలతో, చిన్నారులతో కలిసి అనేక మంది శివలింగాన్ని దర్శించుకొని మహాదేవుని ఆశీర్వాదం అందుకున్నారు.ఈ ఐసు లింగం దర్శనం చాలా అరుదుగా లభిస్తుందని, మహాశివుడి కరుణ ప్రసాదంగా భావిస్తున్నామని స్థానికులు తెలిపారు. ఆనందపురంలో ఏర్పడిన ఈ భక్తి వాతావరణం గ్రామానికే కాకుండా మొత్తం చుట్టుపక్క గ్రామాలకు కూడా ఆధ్యాత్మిక శోభను తీసుకొచ్చింది.

వయోజన విద్యలో భాగంగా 'ఉల్లాస్' కార్యక్రమంపై

విద్యా వాలంటీర్లకు శిక్షణ

విశాలాంధ్ర-గరివిడి: గరివిడి మండలంలో వయోజన విద్య కార్యక్రమంలో భాగంగా 'ఉల్లాస్' పై విద్యా వాలంటీర్లకు ఏకదిన శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణా శిబిరానికి జిల్లా వయోజన విద్య విభాగం కోఆర్డినేటర్ జయరాం హాజరై ప్రత్యేక సత్రాలు నిర్వహించారు.కార్యక్రమంలో %వీణా, ా్రూా%తో పాటు మండల స్థాయి అధికారులు పాల్గొని వాలంటీర్లకు వయోజన విద్య లక్ష్యాలు, అమలు విధానాలు, ప్రజల్లో జాగృతి తీసుకురావడంలో వాలంటీర్ల పాత్రపై మార్గదర్శకాలు అందించారు. వాలంటీర్లలో అవగాహన, నైపుణ్యాలను పెంపొందించడమే ఈ శిక్షణ ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు పేర్కొన్నారు.

ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో ప్రార్థనలు

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: ఏసు ప్రేమాలయం ఆధ్వర్యంలో పట్టణంలోని గురజాడ కళా భారతి ఆవరణలో గత వారం రోజులుగా జరిగిన ప్రార్థనలు సోమవారం ముగిసాయి. ప్రతీ ఏడాది నవంబర్ నెలలో ప్రపంచ శాంతి కోసం నిర్వహించే ఈ ప్రార్థనలు ఏసు ప్రేమాలయం పాస్టర్ అలజంగి రవి కుమార్ నిర్వహించారు. నవంబరు 11 నుండి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఈ ప్రార్థనలు దేశ క్షేమము, భద్రత, ప్రజల ఆరోగ్యం, స్త్రీల సంక్షేమము, ఉగ్రవాద నిర్మూలన తదితర అంశాల కోసం క్రీస్తును ప్రార్ధించడం జరిగిందని తెలిపారు. ఈ ప్రార్థన కార్యక్రమాలకు ప్రతి రోజూ విశాఖపట్నం, శ్రీకాకుళం, మన్యం, అనకాపల్లి జిల్లాల చర్చిల నుండి దైవజనులు విశ్వాసులు పాల్గొన్నారు. సోమవారం జరిగిన ముగింపు వేడుకలో బిసప్ ఎం. మోహన్ రావు దైవ సందేశం అందించారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ ఏ నవీన్ కుమార్, పాస్టర్ అలజంగి రవికుమార్, సిస్టర్ సువర్ణ, స్టీఫెన్ పాల్సన్, వివేక్ ,బిషప్ ఐజక్, మధు, శార, సునీత, ఝాన్సీ, మేరీ రత్నం తదితరులు పాల్గొన్నారు.

కోడూరు-శేరిపేట గ్రామాలకు రెండు బోర్లు మంజూరు

విశాలాంధ్ర-గరివిడి: గరివిడి మండలంలోని కోడూరు మరియు శేరిపేట గ్రామాల్లో ప్రజల కోరిక మేరకు రెండు కొత్త బోర్లు మంజూరు చేసి ప్రారంభించారు. 15వ ఫైనాన్స్ గ్రాంట్ నిధుల నుండి ఈ బోర్లు ఏర్పాటు చేయగా, నవంబర్ 17న గరివిడి మండల అధ్యక్షుల ప్రతినిధి మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ మీసాల విశ్వేశ్వరరావు చేతుల మీదుగా కొబ్బరికాయ కొట్టి బోర్లను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కోడూరు సర్పంచ్ గేదెల ఆదినారాయణ, ఎంపీటీసీ సన్యాసిరావు, శేరిపేట సర్పంచ్ పిల్లా రామాయమ్మ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ జమ్ము కృష్ణ, గ్రామ పెద్దలు మరియు వెదుల్లవలస సర్పంచ్ గుడివాడ తమ్మినాయుడు పాల్గొన్నారు.గ్రామాల్లో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు ఈ బోర్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని గ్రామస్థులు తెలిపారు. అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి గ్రామాభివృద్ధికి కృషి చేస్తుండడాన్ని స్థానికులు అభినందించారు.

అనారోగ్యంతో మృతి చెందిన కార్యదర్శి కి ఘన నివాళి

విశాలాంధ్ర-మెరకముడిదాం: సోమవారం మండల అభివృద్ధి కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన ఉత్తరావల్లి కార్యదర్శి అంబటి గణపతికి ఎంపీడీవో జి భాస్కరరావు ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బంది మరియు కార్యదర్శులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారి కుటుంబ సభ్యులకు సంతాపం తెలిపారు.

విద్యార్థుల్లో ప్రేరణ కలిగించిన తెలుగు ఉపాధ్యాయుడుని సత్కరించిన ఎంపి కలిశెట్టి

విశాలాంధ్ర-మెరకముడిదాం: 2024 25 విద్యా సంవత్సరంలో 10వ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన మెరకముడిదాం మండల విద్యార్థులను విమాన ప్రయాణం కల్పించిన గోపన్నవలస ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు మరడాన సత్యారావు ని విజయనగరం పార్లమెంటు సభ్యులు కలి శెట్టి అప్పలనాయుడు సోమవారం కొండ దాడి గ్రామంలోఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ విద్యార్థుల్లో ప్రేరణ కలిగించి, వారిలో పోటీ తత్వాన్ని పెంచి, పదవ తరగతి పరీక్షల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించేందుకు సత్యారావు మాస్టారు చేస్తున్న ప్రయత్నాన్ని ప్రశంసించారు. ఈ సందర్భంగా సత్యారావు మాస్టారు మాట్లాడుతూ 2025 26 విద్యా సంవత్సరానికి గాను చీపురుపల్లి నియోజకవర్గ పరిధిలో ఉన్న నాలుగు మండలాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 10వ తరగతి విద్యార్థులకు విమాన ప్రయాణాన్ని కల్పిస్తానని ఎంపీ సమక్షంలో మాటిచ్చారు. దీంతో స్థానిక నాయకులు కె. త్రిమూర్తులు రాజు సత్యారావు మాస్టారుకు ఉన్న ఉదార స్వభావాన్ని కొనియాడారు.

శాఖ గ్రంధాలయ అధికారిణి స్వర్ణ కుమార్ ఆధ్వర్యంలో ఘనంగా కవి సమ్మేళనం

విశాలాంధ్ర-బొబ్బిలి : పట్టణం జండా మహల్ జంక్షన్ శాఖ గ్రంథాలయ అధికారిణి స్వర్ణ కుమారి ఆధ్వర్యంలో ఈనెల 14 నుండి 20 వరకు తలపెట్టిన 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగానే సోమవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎం ఎస్ వి లలిత, తెలుగు ఉపాధ్యాయులు ఎం పార్వతి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

గర్భాం పి హెచ్ సి పరిధిలో ఉన్న గ్రామాల్లో స్పర్శలేని చర్మాన్ని తనిఖీ

విశాలాంధ్ర-మెరకముడిదాం : మండలయిలో గర్భాం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఉన్న 27 గ్రామాల్లో 17 నుండి 30 తేదీ వరకు లేప్రోసి కేసులు డిటెక్షన్ కంపెయిన్ నిర్ణయించడం జరుగుతుందని డాక్టర్ అనిల్ రాం కుమార్ రెడ్డి తెలిపారు.ఈ కంపెయిన్ ఇంటి%శీ%టి కి వెళ్ళి మొత్తం కుటుంబ సభ్యులు అందరికి చర్మం పైన ఎక్కడ స్పర్శ లేని మచ్చలు తనిఖీ చేయడం జరుగుతుంది. ఒకవేళ స్పర్శ లేని మచ్చలు ఉన్నట్లయితే వారిని అనుమానితులు గా గుర్తించి వారిని మెడికల్ ఆఫీసర్ కాన్ఫర్మ్ చేసి వారికీ ట్రీట్మెంట్ ఇవ్వడం జరుగుతుంది. ఈ సర్వే ప్రక్రియ అంత ఆశలు చేయడం జరుగుతుంది. ఏ ఆన్ ఎం,ఎస్ లు సర్వే కి సూపెర్వైస్ చేయడం జరుగును అని తెలిపారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ అజయకుమార్, ఎంపీ హెచ్ ఈ ఓ ఏ. మురళీకృష్ణ పి హెచ్ ఎన్ వి. రాధాబాయ్, ఏఎన్ఎంఎస్ లు ఎం ఎల్ హెచ్ పి లు ఆశా వర్కర్లు పాల్గొనడం జరిగింది.

గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

విశాలాంధ్ర -గంట్యాడ: మండల కేంద్రమైన గంట్యాడ లోని స్థానిక శాఖ గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా ని్ే వ ు ఎా ం‌ ం గ్రంథాలయంలో గల పుస్తకాలతో పుస్తక ప్రదర్శన ఏర్పాటు చేయడమైనది. గ్రంథాలయ అధికారి కే శ్రీనివాస్ మాట్లాడుతూ పుస్తక పఠనం చేయడం ద్వారా మన మేధస్సు వికసిస్తుందని, విజ్ఞానవంతులుగా తయారు కావడానికి దోహదపడుతుందని తెలియజేశారు. విద్యార్థుల కు తమ ఖాళీ సమయాల్లో గ్రంథాలయాలలో గల పుస్తకాలను చదవాలని ఆయన పిలుపునిచ్చారు.

ఎం.వీ.జీ.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ (ఏ) కాంపోజిట్ మెటీరియల్స్‌లో పురోగతి

మోడలింగ్ మరియు ప్రయోగాత్మక విధానాలపై ఐదు రోజుల ఆన్లైన్ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-డెంకాడ: మండల కేంద్రంలోని చింతలవలస వద్ద ఉన్న ఎం.వీ.జీ.ఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్(ఏ) లోని మెకానికల్ ఇంజనీరింగ్ విభాగం & సివిల్ ఇంజనీరింగ్ విభాగం సంయుక్తంగా మిశ్రమ పదార్థాలలో ఇటీవలి పురోగతులు మోడలింగ్ను సమగ్రపరచడం మరియు ప్రయోగాత్మక విధానాలపై 5 రోజుల ఆన్లైన్ ఎఫ్.డీ.పీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి మిశ్రమ పదార్థాలలో తాజా పురోగతుల గురించి అత్యాధునిక జ్ఞానాన్ని అందించడం, మెరుగైన ఇంజనీరింగ్ అప్లికేషన్ల కోసం మోడలింగ్ మరియు ప్రయోగాత్మక విధానాలను ఏకీకృతం చేయడం లక్ష్యంగా పెట్టుకుంది. సోమవారం జరిగిన ఈ 5 రోజుల ఆన్లైన్ ఎఫ్.డీ.పీ కార్యక్రమం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎన్.ఐ.టీ రూర్కెలాలోని మెటలర్జికల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ డా. రాజేష్ కుమార్ ప్రస్టీ ముఖ్యతిథిగా హాజరయ్యారు. నిర్మాణం మరియు తయారీ ప్రక్రియలను మెరుగుపరచడంలో మిశ్రమ పదార్థాల ప్రాముఖ్యతను ఎం.వీ.జీ.ఆర్ ప్రిన్సిపాల్ డా. వై.ఎం.సి. శేఖర్ వివరించి, మిశ్రమ పదార్థాల రంగంలో వినూత్న పరిణామాలను స్వీకరించి పనిచేసే ఆలోచన దృక్పథం ఉండాలని ఈ ఎఫ్.డీ.పీ లో పాల్గొన్న వాళ్లందరికీ సూచించారు. ముఖ్య అతిథి ప్రొఫెసర్ డా. రాజేష్ కుమార్ ప్రస్టీ ప్రసంగిస్తూ, ఫైబర్-రీన్ఫోర్స్డ్ పాలిమర్లు, నానో కంపోజిట్లు మరియు మిశ్రమ పదార్థాలను అభివృద్ధి చేయడానికి అవసరమైన ఫాబ్రికేషన్ టెక్నిక్లు వంటి అంశాలపై దృష్టి సారించాలని మరియు మిశ్రమ పదార్థాలలో అభివృద్ధి చెందుతున్న ధోరణులపై విలువైన ఆలోచన పనితీరు ఉండాలని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా 250 మందికి పైగా అధ్యాపకులు, పరిశోధనా పండితులు మరియు పరిశ్రమ నిపుణులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. డా. రమ్యశ్రీ ముళ్ళపూడి, ఐ.ఐ.టీ హైదరాబాద్ డా. డి.రవి ప్రసాద్, ఎన్.ఐ.టీ వరంగల్‌బీ డా.చందలూరి వినయ్ కుమార్, ఎన్.ఐ.టీ తిరుచిరాపల్లి డా. బి. రవి కుమార్, డి.జి.ఎం - చెట్టినాడ్ సిమెంట్‌బీ డా. దినేష్ కుమార్ రాథోడ్, ఎం.ఎన్.ఐ.టీ జైపూర్‌బీ డా. నితిన్ శర్మ, కె.ఐ.ఐ.టీ భువనేశ్వర్ డా. కిషోర్ కుమార్ మహతో, వి.ఐ.టీ వెల్లూరుబీ డా. కె రాజేశ్వరరావు, మాజీ ప్రొఫెసర్-ఎం.వి.జి.ఆర్ మరియు రిటైర్డ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-నీటి పారుదల శాఖబీ డా. శుభం, వి.టి.ఓ.ఎల్ ఏవియేషన్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఈ 5 రోజుల ఆన్లైన్ ఎఫ్.డి.పి కార్యక్రమంలో ఫైబర్-రీన్ఫోర్స్డ్ కాంపోజిట్ల కోసం క్యారెక్టరైజేషన్ పద్ధతులు, నానోకంపోజిట్ల కోసం ఫ్యాబ్రికేషన్ టెక్నిక్లు మరియు కాంపోజిట్ మెటీరియల్స్ యొక్క బాలిస్టిక్ పనితీరు వంటి వివిధ అంశాలపై నిపుణుల ఉపన్యాసాలు ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో మెకానికల్ సివిల్ ఇంజనీరింగ్ హెచ్.ఓ.డీ డా. ప్రవీణ్ కల్లా, సివిల్ ఇంజనీరింగ్ హెచ్.ఓ.డీ డా. మురళీ సాగర్ వర్మ సాగి, మెకానికల్ సివిల్ ఫ్యాకల్టీ ఎఫ్.డి.పి కోఆర్డినేటర్లు, డి సంతోష్ కుమార్, డా. జి.ప్రమోద్ కుమార్, బీ.వీ జోగా రావు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యత పెంపుదల చేయడమే ఉల్లాస్ లక్ష్యం : ఎంపీడీవో సురేష్

విశాలాంధ్ర -చీపురుపల్లి: నిరక్షరాశులయిన మహిళలకు చదువుకున్న మహిళలు చదువు చెప్పడంతో పాటువారికి డిజిటల్ అక్షరాస్యతను ఆర్థిక అక్షరాస్యతను పెంపుదల చేయడమే ఉల్లాస్ అక్షర ఆంధ్ర ట్రైనింగ్ ప్రధాన ఉద్దేశం అని చీపురుపల్లి ఎంపీడీవో ఐ సురేష్ అన్నారు. సోమవారం నాడు చీపురుపల్లి ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఇటువంటి శిక్షణ కార్యక్రమం వలన మహిళల్లో అక్షరాస్యత పెరుగుతుందని తద్వారా వారు అనేక కార్యక్రమాలను వినియోగించుకోవడానికి చదువు ఒక ఆయుధంగా మారుతుంది అని ఎంపీడీవో అన్నారు .ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా నుంచి వచ్చిన జయరాం మాట్లాడుతూ ఈ ఉల్లాస్ కార్యక్రమం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ప్రధాన ఉద్దేశంగా 100 రోజులు పాటు ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. అనంతరం పరీక్ష కూడా నిర్వహిస్తామన్నారు ముఖ్యంగా వాలంటీర్ టీచర్లు అందరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమం లో ఏటీఎం ఎన్ అప్పలనాయుడు , డిప్యూటీ ఎంపీడీవో జి. అప్పలనాయుడు , డిజిటల్ లీటరసీ కో ఆర్డినేటర్ , సీసీలు వీఏవోలు తదితరులు పాల్గొన్నారు పాల్గొన్నారు.

వయో వృద్ధుల సంరక్షణ చట్టం పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి

మండల న్యాయ సేవా కమిటీ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం రోహిణి రావు

విశాలాంధ్ర-బొబ్బిలి : స్థానిక కోర్టు ఆవరణ లో జిల్లా న్యాయ అధికార సంస్థ వారి ఆదేశానుసారం మండల న్యాయ సేవా కమిటీ చైర్మన్, మండల న్యాయ సేవా కమిటీ, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం రోహిణి రావు ఆధ్వర్యంలో తల్లిదండ్రుల మరియు వృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 కోసం న్యాయ అవగాహన సదస్సు ను నిర్వహించారు. వయోవృద్ధుల సంరక్షణ చట్టంలో తల్లిదండ్రుల మరియు వృద్ధుల నిర్వహణ, సంక్షేమ చట్టం, 2007 అనేది తల్లిదండ్రులు లేదా వృద్ధులు తమ పిల్లలు లేదా బంధువుల నుండి జీవనోపాధి పొందగలరని నిర్ధారించే ఒక భారతీయ చట్టం. ఈ చట్టం ప్రకారం, వారు తమ సొంత ఆదాయంతో లేదా ఆస్తితో తమను తాము పోషించుకోలేని పరిస్థితుల్లో, చట్టం ప్రకారం వారి పిల్లలు లేదా బంధువులు వారికి ఆర్థిక సహాయం అందించాలని. ఇది వారిని పేదరికం మరియు నిర్లక్ష్యం నుండి రక్షిస్తుందని. నిర్లక్ష్యం చేస్తే, ట్రిబ్యునల్ ద్వారా వారి పిల్లలను అప్పీలు చేయవచ్చు అన్నారు.తల్లిదండ్రుల మరియు సీనియర్ సిటిజన్ల శ్రేయస్సును నిర్ధారించడం, వారి జీవనోపాధి కోసం రక్షణ, ఆహారం, బట్టలు, నివాసం మరియు వైద్య సహాయం అందించడం చేయాలని. పిల్లలు తమ తల్లితండ్రుల సంరక్షణకు బాధ్యత వహించాలి. ఒకవేళ పిల్లలు లేకుంటే, ఆస్తిని వారసత్వంగా పొందే బంధువులు బాధ్యత వహించాలని ఈ చట్టం కింద, నిర్వహణ మరియు సంక్షేమ కేసులను విచారించడానికి ప్రతి జిల్లాలో ఒక ట్రిబ్యునల్ ఏర్పాటు చేయబడిందని. పిల్లలు లేదా బంధువుల నుండి సరైన సంరక్షణ పొందలేదని భావించినప్పుడు, వారు ఈ ట్రిబ్యునల్ కు ఫిర్యాదు చేయాలని కోరారు. ఒక వేళ తల్లిదండ్రులు తమ ఆస్తిని పిల్లలకు బదిలీ చేసి, తర్వాత వారు తమను జాగ్రత్తగా చూసుకోకపోతే, ఆ గిఫ్ట్ డీడ్ ను రద్దు చేయమని వయోవృద్ధులు కోర వచ్చిన అని తెలిపారు.ట్రిబ్యునల్ ముందు కేసుల విచారణలో న్యాయవాదుల ప్రమేయం ఉండదని. భారతదేశంలో ఉన్న సాంప్రదాయ ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతున్న నేపథ్యంలో, తల్లిదండ్రుల మరియు వృద్ధుల సంరక్షణను నిర్ధారించడానికి ఈ చట్టం చాలా ముఖ్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మత్స్ ఆనంద్ కుమార్, ఆర్ వి ఎస్ ఎస్ ప్రసాద్, పి మురళి మోహన్ కుమార్, అమరాపు రామకృష్ణ, భోగి దాసు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలి

విశాలాంధ్ర-విజయనగరం : ప్రజా ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించి పుర సేవలను మరింత విస్తృత పరచనున్నట్లు విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 1 ఫిర్యాదు అందింది. వాటిని స్వీకరించిన కమిషనర్ పల్లి నల్లనయ్య ఫిర్యాదుల పరిష్కారానికై సంబంధిత అధికారులకు ఆదేశించారు. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి ఒక ఫిర్యాదు అందింది. ఈ సందర్భంగా మీడియాతో కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ ప్రతి సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయం నందు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వీటిలో వచ్చిన ఫిర్యాదులను ప్రాధాన్యతా క్రమంలో పరిష్కరించేందుకు తగు చర్యలు చేపడుతున్నామన్నారు. నిరంతరం క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుని వాటిని కూడా పరిష్కరిస్తున్నామన్నారు. అలాగే సిబ్బంది దృష్టికి వచ్చిన ఫిర్యాదులను కూడా వెంటనే పరిష్కారం దిశగా చొరవ చూపాలని ఆదేశిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో

ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు పాల్గొన్నారు.

తెర్లాం మండలం గ్రీన్ అంబాసిడర్ జీతాలు బకాయిలు వెంటనే చెల్లించండి : సిఐటియు

విశాలాంధ్ర-తెర్లాం : మండలంలో గ్రీన్ అంబాసిడర్లకు నెలలు తరబడి జీతాలు చెల్లించకపోవడం దారుణమని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు పి శంకరరావు మండల నాయకులు సింగిరెడ్డి గోపాలు రామారావు అన్నారు. మండలంలో 4 నెలల నుండి 18 నలలు వరకు జీతాలు బకాయిలు ఉన్నాయి తెల్లవారితే గ్రామాల్లో మలమూత్రాలు పారిశ్విద్యాన్ని శుభ్రం చేస్తూ గ్రామాల్లో ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ తమ ప్రాణాలను పణంగా పెడుతూ పనిచేస్తున్న గ్రీన్ అంబాసిడర్ లకు నెలలు తరబడి జీతాలు చెల్లించకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సంబంధిత శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ గారు ఇది ఆలోచించకపోవడం అన్యాయమని అన్నారు. గ్రామాల్లో అపారిశుధ్యం పెరిగిపోయి అనేక వ్యాధులు డయేరియా లాంటి జబ్బులు ప్రబలి ప్రజలు ప్రాణాలు పోతున్నాయని అన్నారు. పంచాయితీ నిధులతో గ్రీన్ అంబాసిడర్ జీతాలు చెల్లించడం సాధ్యం కాదు ప్రభుత్వం నేరుగా గ్రీన్ అంబాసిడర్ల అకౌంట్ లోకి జీతాలు చెల్లించే పద్ధతిని తీసుకురావాలని పవన్ కళ్యాణ్ గారిని డిమాండ్ చేస్తున్నాం ఈ ధర్నా కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లుపాల్గొన్నారు.

హిందూపురంలో వైసిపి పార్టీ కార్యాలయాన్ని ధ్వంసం చేసిన కూటమి

- కూటమి గుండా గిరి ఖండించండి

- మాజీ ఎమ్మెల్యే శంబంగి

విశాలాంధ్ర-బొబ్బిలి : ఇటీవలే హిందూపురంలో జరిగిన సంఘటన వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయనీ కూటమి ప్రభుత్వ గూండాలు కొంతమంది వెళ్లి కార్యాలయం ధ్వంసం చేసిన సంఘటనపై మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు తీవ్రంగా ఖండించారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశం లో మాజీ ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వానికి పార్టీ కార్యాలయాలు విధ్వంసం పాల్పడడం సరికాదని మండి పడ్డారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ఇటువంటి నీచ రాజకీయాలు చేయడం సరికాదని అన్నారు. ఇటువంటి సంఘటనలు ప్రజలు గమనిస్తున్నారని రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి. తగిన గుణపాఠం ప్రజలు చెల్లిస్తారని అన్నారు. ఈ సమావేశంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కన్వీనర్ శంబంగి వేణు గోపాల నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణరావు, తదితరులు పాల్గొన్నారు.

న్యాయ అవగాహన సదస్సు

..

విశాలాంధ్ర-గజపతినగరం : గజపతినగరం కోర్టు ఆవరణలో సోమవారం కోర్టు న్యాయమూర్తి ఏ. విజయ్ రాజ్ కుమార్ న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో వృద్ధాప్యంలో పిల్లలు విస్మరిస్తే విన్నవించుకోవాలని అన్నారు. తల్లిదండ్రుల సంరక్షణ చట్టంపై అవగాహన గూర్చి వివరించారు. ఆస్తులు రాసే సమయంలో వృద్ధాప్యంలో చూడకపోతే ఆస్తులు దక్కమని రాస్తే భయంతో చూస్తారని,